# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-09-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **సహాయక చర్యల్లో పాల్గొనేందుకు విపత్తు నిర్వహణ దళాలు రాష్ట్రానికి చేరుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
3. **లీకేజీలున్న వసతిగృహాల భవనాల నుంచి విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు.**
4. **వరద బాధితులను ఆదుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.**
5. **విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.**
6. **ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ఐటీకి కేటరింగ్ సేవల్ని అందిస్తున్న ఆహార సంస్థ సేవల్ని ప్రభుత్వం రద్దు చేసింది.**

==========================

విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉదయం మరోసారి పర్యటించారు. సింగ్ నగర్‌లో వంతెనకు ఆనుకుని ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. బాధితులకు ఆహారం, రక్షిత మంచి నీరు అందిందా లేదా అని బాధితులని అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులకు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, నీళ్లు, పాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అందరికీ సాయం అందుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 37 సెకన్లు)

--------------------------

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టేందుకు జాతీయ విపత్తు నిర్వహణ దళం-ఎన్డీఆర్ఎఫ్ బృందాలు విజయవాడకు చేరుకున్నాయి. తమిళనాడు నుంచి 3, పంజాబ్ నుంచి 4, ఒడిశా నుంచి 3 విపత్తు బృందాలు, పవర్ బోట్లు, విపత్తు నిర్వహణ పరికరాలతో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారని విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.కాగా ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో సహాయక చర్యల్లో 8 ఎన్డీఆర్ఎఫ్,

10 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. వాయుమార్గం ద్వారా సహాయక చర్యల్లో హెలికాప్టర్లు పాల్గొంటున్నాయి.

---------------------------

వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కేంద్రం నుంచి విపత్తు నిర్వహణ దళాలు రాష్ట్రానికి చేరుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో మంత్రి ఈరోజు మాట్లాడుతూ,

వాయిస్ (26 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో లీకేజీలున్న వసతిగృహాల భవనాల నుంచి విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గిన తర్వాత వాటి నాణ్యత పరిశీలించి, సురక్షితం అనుకుంటేనే విద్యార్థులను వెనక్కి రప్పించాలని స్పష్టం చేశారు. అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కాచి వడపోసిన నీటిని, వేడి ఆహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు ఉన్న విద్యార్థులకు వైద్య సేవలందించాలన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 20 సెకన్లు....

---------------------------

కృష్ణానదికి వరద ఉధృతి పెరగడటంతో వరద ముంపుకు గురైన విజయవాడ రామలింగేశ్వర నగర్ కరకట్ట ప్రాంతాన్ని, ఇళ్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి ఈరోజు పరిశీలించారు. ఇళ్ళలో చేరిన నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించే చర్యలు పెట్టాలని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పటంతో పాటు, అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో విశాఖపట్నం నుంచి ఈరోజు బయలుదేరాల్సిన 12 రైళ్ళను రద్దు చేసినట్లు వాల్తేర్ రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ తెలిపారు. అలాగే విశాఖపట్నంకు వచ్చే 19 రైళ్లు రద్దు చేశామన్నారు.పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని రద్దయిన రైళ్లకు సంబంధించిన ప్రయాణ టికెట్ల రుసుమును తిరిగి చెల్లిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, నౌపడ, రాయగఢలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

---------------------------

పులివెందుల పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో రిటైనింగ్ వాల్ దగ్గర కృష్ణా నది ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

---------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి 11.38 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 500 క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తం 70 గేట్లు తెరిచి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ వద్ద 24.3 అడుగుల మేర నీటిమట్టం కొనసాగుతోంది. వరద ఉధృతి నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీపై వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు.

ఇలా వుండగా ప్రజలు భయాందళోనకు గురికావొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. ఉధృతంగా నీరు ప్రవహించే వాగులు, కాలువలు, రహదారులు, వంతెనలు, మురుగు గుంతలకు దూరంగా ఉండాలని సూచించారు.

---------------------------

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో విజయవాడలో ప్రాంతాల వారీగా ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలలో ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో బాధితులకు అందుబాటులో ఉంటారని తెలిపింది. బాధితులకు అందించే పునరావాస కార్యక్రమాలు సహాయక చర్యలను ఈ అధికారులు పర్యవేక్షిస్తారని ప్రభుత్వం తెలిపింది.

---------------------------

భారీ వర్షాల ప్రభావంతో ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులకు సహాయం కల్పించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు దిల్లీరావుతో కలిసి ఆయన వరద ప్రభావిత జిల్లాల్లోని అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ, వరద ముంపులో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నష్టాన్ని ఉపగ్రహాల ద్వారా ఏ మేరకు అంచనా వేయొచ్చో పరిశీలించాలని సూచించారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు జిల్లాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి జలవనరుల శాఖ, స్థానిక యంత్రాంగంతో సమన్వయం చేసుకుని వాటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

====================